

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



**విలేకరులు కావలెను**


తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 48 | ఆదివారం | 13 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ యంజాల ప్రవీణ్ | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.48 | Sunday | 13.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |


# చర్చలే శరణ్యం!

**బ్రిక్స్ సదస్సుకు బంగ్లా ప్రధాని గైర్హాజరు.. స్వదేశంలో భిన్నాభిప్రాయాలు**

**న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు బంగ్లాదేశ్ ప్రధాని గైర్హాజరు**

**ప్రధాని నిర్ణయంపై బంగ్లాదేశ్ మీడియా, విశ్లేషకుల నుంచి మిశ్రమ స్పందనలు**

**హాజరైతే మంచిదన్న కొందరు.. దీనివల్ల దేశానికి నష్టమేమీ లేదన్న మరికొందరు**

**బిమ్స్‌టెక్ ఛైర్మన్ హోదాలో ఆహ్వానం అందడమే కారణమని ప్రభుత్వ వర్గాల వాదన**

**మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యవహారం కూడా ఓ కారణమనే ఊహాగానాలు**

న్యూఢిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మన్ హాజరుకాకపోవడం ఆ దేశంలో ఆసక్తికర చర్చకు దారితీసింది. గ్లోబల్ సౌత్ దేశాలకు కీలక వేదికగా మారుతున్న బ్రిక్స్ ప్రాధాన్యతను విశ్లేషిస్తూనే, ప్రధాని నిర్ణయంపై అక్కడి మీడియా, విశ్లేషకుల నుంచి మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బ్రిక్స్ కూటమి ప్రస్తుతం 11 దేశాలకు విస్తరించింది. బంగ్లాదేశ్ ఇందులో సభ్యదేశం కానప్పటికీ, బంగాళాఖాత తీర దేశాల కూటమి 'బిమ్స్‌టెక్'కు ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్నందున ప్రధాని తారిక్ రెహ్మన్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో, అమెరికాలో బంగ్లాదేశ్ మాజీ రాయబారి ఎం. హుమయూన్ కబీర్ మాట్లాడుతూ, "బ్రిక్స్ సదస్సు ఒక ముఖ్యమైన అంతర్జాతీయ కార్యక్రమం. ప్రధాని హాజరై ఉంటే బాగుండేది. తద్వారా ఇతర దేశాల నేతలతో వ్యక్తిగతంగా

# పన్నుపై అపోహలొద్దు

**20 శాతాన్ని సీఎం ఆమోదం మేరకు 10 శాతానికి తగ్గిస్తున్నాం**

**'క్యూర్'లో ఆస్తి పన్నుల పెంపుపై స్పష్టతనిచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు**

**ఈ మేరకు బిల్లుకు సవరణ ప్రతిపాదించిన స్పీకర్.. ఆమోదించిన అసెంబ్లీ**

**అపెక్స్ కౌన్సిల్‌కు మేయర్లనూ ఆహ్వానించాలని కోరిన బీజేపీ, ఎంఐఎం**



హైదరాబాద్: కోర్ అర్బన్ రీజియన్‌లో పన్నులపై అపోహలు వద్దని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. ప్రతి ఏటా 20 శాతం ఆస్తి పన్నులు పెరుగుతాయనే విషయం వాస్తవం కాదన్నారు. పన్నులు ఎలా అంటే అలా పెంచడానికి వీల్లేదని, ప్రస్తుతం అమల్లో ఉన్న కంప్యూటేషన్ పద్ధతి ప్రకారమే పన్నులు పెరుగుతాయని, గరిష్టంగా 10 శాతానికి మించి పెరగవన్నారు. అది కూడా కేవలం 0.15 శాతం నివాస, 0.75 శాతం వాణిజ్య సముదాయాల మీద మాత్రమే పడుతుందని వివరించారు.

- మిగతా 2వ పేజీలో

# ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?..

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్

ఏడు దశల తనిఖీ అంటున్నా అక్రమాలు ఎలా జరిగాయని విమర్శ

నకిలీ ఖోఖో సర్టిఫికెట్లు, జరగని క్రీడాపోటీల అంశాలను ప్రస్తావించిన వైనం

నియామక ప్రక్రియపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్



2లో



# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల

# జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్

- అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలని కేంద్రాన్ని కోరిన సీఎం
- జనవరి 1 నుంచి రాష్ట్రంలో ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ ప్రకటన
- రూ.249 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు ప్రారంభం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో వైద్య రంగానికి కొత్త ఊపు వచ్చిందన్న చంద్రబాబు
- కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి




వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన

- మిగతా 2వ పేజీలో

# అదొక దైవిక అనుభూతి.. థాంక్యూ కేరళం

- కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న పవన్ కల్యాణ్
- చికిత్స అనంతరం కేరళ ప్రజలకు, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు
- పలు ప్రాచీన ఆలయాలను సందర్శించి దైవిక అనుభూతి పొందానన్న పవన్
- సహకరించిన సీఎం, పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు
- కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యం తన పర్యటనను ప్రత్యేకంగా మార్చాయని వెల్లడి



# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్

రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానిస్తున్నారని విమర్శ

బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి

ఆధారంగా సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్

డీఎస్సీ స్కామ్‌పై ప్రభుత్వం సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్



# ద్విపాత్రాభినయం తప్పదు

**పశ్చిమాసియాలో శాంతికోసం బ్రిక్స్ దేశాలు శ్రమించాలి**

**సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు**

2లో

# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

(మొదటి పేజీ తరువాయి)

భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?..

ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న 'ఏడు దశల వెరిఫికేషన్' ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహరిస్తోందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. "ఇన్ని అక్రమాలు బయటపడుతుంటే, అసలు ఎక్కడ, ఏం వెరిఫికేషన్ చేశారు?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా, డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు. ఈ లోపాలే అక్రమాలకు ఆస్కారం కల్పించాయా అని సందేహం వ్యక్తం చేశారు. జరిగిన తప్పులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. కాగా, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉంది. అయితే, నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని, సర్టిఫికెట్ల పరిశీలన పలు దశల్లో పకడ్బందీగా నిర్వహించామని ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. కొన్ని ఆరోపణలపై అధికారులు మీడియా సమావేశాల్లో వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా జగన్ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# విభేదాలు వివాదాలుగా మారొద్దు

న్యూఢిల్లీ: భారత్--చైనా సంబంధాలు మరింత బలోపేతం కావాలంటే ఇరుదేశాల సరిహద్దు వద్ద శాంతియుత వాతావరణం నెలకొనడం అత్యవసరమని భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు స్పష్టం చేశారు. సరిహద్దు నిర్వహణకు సంబంధించిన ప్రస్తుత ఒప్పందాలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రధానంగా భారత్, చైనా సంబంధాలపై చర్చించారు. వాణిజ్య లోటును తగ్గించడం, ఉగ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడం, బహుపాక్షిక వేదికలపై న్యాయమైన, పారదర్శక వాణిజ్యం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. విభేదాలు వివాదాలుగా మారకూడదని ఇరువురు నేతలు పునరుద్ఘాటించినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. తమ సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో చూడాలని వారు పేర్కొన్నట్లు వెల్లడించింది. వాణిజ్య అసమతుల్యత, సప్లై చైన్లు, మార్కెట్ ప్రవేశాన్ని సులభతరం చేయడం వంటి అంశాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని మోదీ, జిన్‌పింగ్ నిర్ణయానికి వచ్చారు. సమగ్ర ద్వైపాక్షిక సంబంధాలు, ఇరుపక్షాల దీర్ఘకాలిక ప్రయోజనాల ఆధారంగా సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టంచేశారు. పరస్పర సంబంధాల విషయంలో భారత్, చైనాలు పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనం అనే మూడు అంశాల ఆధారంగా ముందుకు సాగాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్

(మొదటి పేజీ తరువాయి)

క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ. 249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.

### డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో అభివృద్ధి పరుగులు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

### ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం

ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

### అమరావతి.. భవిష్యత్ టెక్నాలజీ హబ్

అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

# అదొక దైవిక అనుభూతి.. థాంక్యూ కేరళం

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న సంగతి తెలిసిందే. తన పర్యటన ముగిసిన నేపథ్యంలో, కేరళలో తనకు లభించిన అనుభవాలు, ఆదరణపై ఆయన శనివారం ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, తన పర్యటన ఎంతో ప్రశాంతంగా, మధుర జ్ఞాపకాలతో సాగిందని పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా తాను తన చికిత్స కోసం కేరళలో ఉన్నానని పవన్ తెలిపారు. "కేరళ ప్రజలకు పేరుగాంచిన ఆప్యాయత, కరుణ, ఆతిథ్యాన్ని స్వయంగా అనుభవించే అవకాశం నాకు లభించింది. నా చికిత్స సమయంలో ఇక్కడ గడిపిన కాలం నాకు మానసిక స్వస్థతను, శాంతిని, ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించింది" అని ఆయన పేర్కొన్నారు. తన చికిత్స విజయవంతం చేయడంలో అంకితభావంతో కూడిన సంరక్షణ, వృత్తి నైపుణ్యం, వ్యక్తిగత శ్రద్ధ కనబరిచిన డాక్టర్ సీతారాం ఆయుర్వేదిక్ రిట్రీట్‌లోని వైద్యులు, యాజమాన్యం, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమయంలో తనకు అందిన సంరక్షణ, మద్దతుకు తాను ఎంతో రుణపడి ఉంటానని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా పలు పవిత్ర దేవాలయాలను సందర్శించే భాగ్యం కూడా తనకు కలిగిందని పవన్ కల్యాణ్ వివరించారు. "త్రిప్రయార్ శ్రీ రామస్వామి, గురువాయూర్ శ్రీ కృష్ణ, మమ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను సందర్శించాను. శతాబ్దాల నాటి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉన్న ఈ ప్రాచీన ఆలయాలు నాకు గాఢమైన భక్తిని, శాంతిని, ఆత్మపరిశీలనకు అవకాశాన్ని అందించాయి. వాటి కాలాతీతమైన ఆచారాలు, పవిత్ర వాతావరణాన్ని అనుభవించడం నిజంగా దైవికమైనది, సంతృప్తినిచ్చింది. మన ప్రాచీన నాగరికతా వారసత్వానికి కేరళ ఆలయాలు సజీవ రూపాలుగా నిలుస్తాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు.

# పన్నుపై అపోహలొద్దు

శనివారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026 (క్యూర్)ను ప్రవేశపెట్టిన శ్రీధర్‌బాబు చట్టం లక్ష్యాలను వివరించారు. క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలు రాష్ట్ర ఆర్థిక ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని వివరించారు. శనివారం మధ్యాహ్నం తర్వాత శ్రీధర్‌బాబు బిల్లుపై జరిగిన చర్చలో పలు పార్టీల సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. బిల్లులో పెట్టిన 20 శాతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం మేరకు 10 శాతానికి తగ్గిస్తున్నట్టు చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ నగరాన్ని పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వరదల నివారణ, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో వివిధ సంస్థలు, శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. భవిష్యత్‌లో నగర అవసరాలకు అనుగుణంగా ఈ వ్యవస్థ పనిచేసేలా క్యూర్ చట్టాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బిల్లు ఆమోదానికి ప్రతిపాదించిన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఈ అంశాన్ని వివరించారు. పన్నుల పెరుగుదలను 20 నుంచి 10 శాతానికి తగ్గిస్తూ బిల్లులో సవరణ చేయాలని సీఎం చేసిన ప్రతిపాదనను సభ ముందు ఆమోదానికి పెట్టారు. ఈ సవరణతోపాటు క్యూర్ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

పాల్వాయి హరీశ్‌బాబు (బీజేపీ) లేవనెత్తిన అంశాన్ని ప్రస్తావిస్తూ కోర్ రీజియన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసే అపెక్స్ కౌన్సిల్ కేవలం విధాన నిర్ణయాల కోసమేనని, ఈ సమావేశాలకు అవసరమైతే మేయర్లను ఆహ్వానిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ కౌన్సిల్ ఏర్పాటు ద్వారా మేయర్లు, కార్పొరేటర్ల స్థానిక అధికారాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని వివరించారు. ఇందుకు విభేదించిన హరీశ్‌బాబు అపెక్స్ కౌన్సిల్‌కు మేయర్లను రమ్మనకపోతే వారికి ఇంకేం అధికారాలుంటాయని ప్రశ్నించారు. ఎంఐఎం సభ్యుడు జుల్ఫికర్ అలీ జోక్యం చేసుకుంటూ.. అపెక్స్ కౌన్సిల్ సమావేశాలకు మేయర్లను ఆహ్వానించాల్సిందేనని డిమాండ్ చేశారు. దీంతో పాల్వాయి హరీశ్‌బాబు బల్లలు చరిచి మరీ అభినందించారు.

# ద్విపాత్రాభినయం తప్పదు

న్యూఢిల్లీ: అభివృద్ధి చెందుతున్న దేశాల నూతన అంతర్జాతీయ విపణుల మధ్య సహకారానికి అత్యంత ప్రభావవంతమైన వేదికగా బ్రిక్స్ కూటమి ఎదిగిందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ఆయన ఈ కూటమి దేశాల అగ్రనేతలనుద్దేశించి కీలక ప్రసంగంచేశారు. "పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతల స్థాపనకు బ్రిక్స్ దేశాలు ద్విపాత్రాభినయం చేయాల్సిందే. ఎందుకంటే పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని యుద్ధాలు, మారుతున్న విపరిణామాలతో ఆయా ప్రాంతాల ప్రజలు కష్టాల కడలిలో పడిపోయారు. అంతర్జాతీయ సమాజం ఉమ్మడి ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్గుతోంది. ఇకనైనా పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం అభివృద్ధి చెందుతున్న దేశాల అగ్రనేతలు ఉమ్మడిగా పోరాడాలి. చరిత్ర గుర్తుంచుకునేలా సరైన పథంలో నడిచి ఈ ప్రాంతాల పురోభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలి"అని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. చైనా సైతం పశ్చిమాసియా, గల్ఫ్‌లో శాంతి,సుస్థిరత కోసం ఈ కూటమితో కలిసి సమష్టిగా కృషిచేస్తుందని స్పష్టంచేశారు. "ఇకనైనా బ్రిక్స్ దేశాలు ప్రచ్ఛన్న యుద్ధకాలంనాటి మనస్తత్వాన్ని వీడాలి. సభ్య దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడం మానుకోవాలి. ఆయా దేశాల సార్వభౌమత్వాలకు భంగం వాటిల్లేలా వ్యవహరించడం వంటి పనులకు చరమగీతం పాడాలి. శత్రుత్వాలకు త్యజించాలి. ఇందుకోసం పరస్పర అవగాహన, విశ్వాసం పెంచుకోవడంపై కూటమి దేశాలు దృష్టిపెట్టాలి. బ్రిక్స్ దేశాలు స్వావలంబన సాధిస్తూనే, దేశీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే సరికొత్త అభ్భివృద్ధిబాటల్లో పయనించడం శుభసూచకం. అగ్రదేశాల ఆధిపత్య విధానాలు, కేంద్రీకృత రాజకీయాల విపరిణామాల దుష్ఫలితాలను మనందరం చవిచూస్తున్నాం. దీంతో శాంతి, అభివృద్ధి, భద్రత, సుపరిపాలన అనేవి కష్టమవుతున్నాయి. వీటికి పరిష్కారాలు వెతుకుదాం. కోవిడ్ సంక్షోభాన్ని సమష్టిగా ఎదుర్కొన్నట్లు ఇకమీదటా వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభం వంటి అంతర్జాతీయ సమస్యలను ఉమ్మడిగా పరిష్కరించుకుందాం"అని జిన్‌పింగ్ అన్నారు.

# చర్చలే శరణ్యం!




(మొదటి పేజీ తరువాయి)

సమావేశమై, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం లభించేది" అని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ సదస్సుకు హాజరు కాకపోవడం వల్ల బంగ్లాదేశ్‌కు దౌత్యపరంగా గానీ, ఆర్థికంగా గానీ ఎలాంటి నష్టం లేదని పలువురు అంతర్జాతీయ సంబంధాల విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధాని తారిక్ ఇప్పటికే చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం వంటి నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారని, రానున్న రోజుల్లో మరికొన్ని దేశాల్లో పర్యటించనున్నారని వారు గుర్తు చేస్తున్నారు. మరోవైపు, బ్రిక్స్ కూటమి బంగ్లాదేశ్ అభివృద్ధికి ఎంతో కీలకమని అక్కడి మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా, బ్రిక్స్ ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (చీఎన్‌డీ)లో బంగ్లాదేశ్ 2021 నుంచి సభ్యురాలిగా ఉంది. ఈ బ్యాంకు ద్వారా బంగ్లాదేశ్‌కు ఇప్పటికే సుమారు 450 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం ఆమోదం పొందింది. ఇది రాజకీయ ఆసక్తికి మించి బలమైన ఆర్థిక బంధాన్ని సూచిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. అధికారికంగా బిమ్స్‌టెక్ ఛైర్మన్ హోదాలో ఆహ్వానం అందడం వల్లే ప్రధాని హాజరు కాలేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అంతర్గత రాజకీయ ఒత్తిళ్లు కూడా ఈ నిర్ణయం వెనుక ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష పడటం, ఆమెను స్వదేశానికి రప్పించాలని ప్రభుత్వం ప్రయత్నించడం వంటి అంశాలు తీవ్ర ఒత్తిడికి కారణమవుతున్నాయి. ఈ సున్నితమైన తరుణంలో అంతర్జాతీయ వేదికపై విమర్శలను ఎదు-ర్కోకుండా ఉండేందుకే ప్రధాని ఈ పర్యటనకు దూరంగా ఉన్నారని కొందరు భావిస్తున్నారు. గతంలో 2016లో గోవాలో జరిగిన బ్రిక్స్-బిమ్స్‌టెక్ సదస్సులో అప్పటి ప్రధాని షేక్ హసీనా పాల్గొనడం గమనార్హం. ప్రస్తుతం ఢిల్లీ సదస్సుకు ఆసియాన్, ఆఫ్రికన్ యూనియన్ వంటి సంస్థల ఛైర్మన్లు, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ వంటి ప్రము-ఖులు కూడా హాజరవుతున్నారు.





## పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

- ఘనంగా పోషకాహార వారోత్సవాలు
- గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి
- ఆకుకూరలు, పాలు, గుడ్లు, మిల్లెట్స్ ఆహారంలో భాగం చేసుకోవాలి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ 18వ వార్డులోని 10వ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త ముత్యాల జ్యోతి ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ బుడ్డ సురేష్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు భీమిడి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, బెల్లం, మునగాకు, మిల్లెట్స్, గోంగూర తదితర పౌష్టికాహార పదార్థాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని వివరించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంతో పాటు శిశువుల ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. పోషకాహారంపై కుటుంబ సభ్యులు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, గర్భిణులు, బాలింతలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- గ్రామ క్రీడాకారులు, క్లాస్‌మేట్స్ మానవత్వం
- రామకృష్ణకు ఘన నివాళులు




**తొలివెలుగు, చిన్నగూడూరు :** చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన మద్దెల రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రామ యువత, క్రీడాకారులు, క్లాస్‌మేట్స్ కలిసి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు రామకృష్ణతో తమకున్న అనుబంధాన్ని, ఆయనతో గడిపిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రామకృష్ణ మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా నిలిచి, వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ సోదరులు మద్దెల రాజు, మద్దెల రవి, జక్కి నాగేష్, పీఈటీ, కుటుంబ సభ్యులు, గ్రామ యువత, క్రీడాకారులు, క్లాస్‌మేట్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడాలి

- చిరుమర్తి లింగయ్యకు కేటీఆర్ సూచన
- ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటం చేయాలి
- కేసీఆర్‌కు అండగా నిర్వహించిన కార్యక్రమాన్ని అభినందించిన కేటీఆర్

**తొలివెలుగు, చిట్యాల :** ప్రజా సమస్యలపై మరింతగా పోరాడాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సూచించారు. శనివారం చిరుమర్తి లింగయ్య హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమానికి వ్యతిరేకంగా చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 'కేసీఆర్‌కు అండగా దళిత దండు' కార్యక్రమాన్ని అభినందించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ ఆధ్వర్యంలో వాటిపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని కేటీఆర్ కోరినట్లు చిరుమర్తి లింగయ్య తెలిపారు.



# సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

- పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు సర్పంచుల సంఘం వినతిపత్రం
- గౌరవ వేతనం రూ.25 వేలకు పెంచాలని విజ్ఞప్తి
- జాయింట్ చెక్ పవర్ విధానం రద్దు చేయాలి
- సీఎం హామీ ఇచ్చిన రూ.10 లక్షల నిధులు వెంటనే విడుదల చేయాలి

**తొలివెలుగు, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం నాయకులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సోదాని భూమన్న యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమిడి ప్రదీప్ జీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీలు నేరుగా నిధులు వినియోగించుకునేలా జనరల్ అకౌంట్ సదుపాయం కల్పించినందుకు మంత్రి సీతక్కను సంఘం నాయకులు గజమాలతో సత్కరించారు.

**సర్పంచుల ఆర్థిక ఇబ్బందులు పరిష్కరించాలి:**

గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో పాటు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని సంఘం నాయకులు మంత్రికి



వివరించారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.25 వేలకు పెంచాలని కోరారు. జాయింట్ చెక్ పవర్ విధానాన్ని రద్దు చేసి సర్పంచులకు పూర్తి స్థాయి ఆర్థిక అధికారాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులపై సర్పంచులకు పూర్తి అధికారం ఇవ్వాలని కోరారు.

**కరెంట్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి:**

గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం తగ్గించేలా విద్యుత్తు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని సంఘం నాయకులు కోరారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన రూ.10 లక్షల నిధులను వెంటనే విడుదల చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



**సీఎం దృష్టికి తీసుకెళ్తా: సీతక్క**

సర్పంచుల సంఘం నాయకులు ప్రస్తావించిన సమస్యలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సర్పంచుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ కారణం దీప్తి రామకృష్ణతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏచూరికి ఘన నివాళులు

- కూరెళ్లలో సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమం
- భారత రాజకీయాలకు ఆయన సేవలు చిరస్మరణీయం
- ఏచూరి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం: సీపీఎం నాయకులు

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు మండలం కూరెళ్ల గ్రామంలో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి దేశానికి, వామపక్ష ఉద్యమానికి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప రాజకీయ ఆర్థికవేత్త, మార్క్సిస్టు సిద్ధాంతవేత్త అని కొనియాడారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీకి వ్యతిరేకంగా వివిధ పార్టీలను ఐక్యం చేయడంలో, ఇండియా కూటమి ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీల ఐక్యత కోసం కూడా ఏచూరి విశేష కృషి చేశారని అన్నారు.




1970 దశకంలో విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించిన ఏచూరి క్రమంగా విద్యార్థి, యువజన సంఘాలకు జాతీయస్థాయిలో నాయకత్వం వహించారని వేముల బిక్షం గుర్తుచేశారు. 1983లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తన పోరాట పటిమను చాటుకున్నారని తెలిపారు. చిన్న వయస్సులోనే సీపీఎం కేంద్ర కమిటీలోకి ఎదిగి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సీతారాం ఏచూరి సిద్ధాంత నిబద్ధత, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆయనను కోల్పోవడం భారత రాజకీయాలకు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి, వార్డు సభ్యుడు తుమ్మలగూడెం యాదయ్య, ఉప సర్పంచ్ హనుమంతుల రమేష్, వార్డు సభ్యుడు కన్నబోయిన అంజయ్య, సీనియర్ నాయకులు భాషాబోయిన రాములు, మరిపెల్లి మల్లయ్య, మారుపాక సత్తయ్య, భాషాబోయిన ఐలయ్య, బుగ్గయ్య, మచ్చగిరి, ఆగయ్య, వీరయ్య, రవి, రాకేష్, గణేష్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



## కోట మల్లారెడ్డికి ఘన నివాళి

- దశదినకర్మకు హాజరైన మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ఉమా మాధవరెడ్డి
- తెలంగాణ ఉద్యమంలో ఆయన చొరవ మరువలేనిది
- రాజకీయ, సామాజిక రంగాల్లో తనదైన ముద్ర వేశారు: నేతలు

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కోట మల్లారెడ్డి పార్టీకి అందించిన సేవలు ఎనలేనివని మాజీ మంత్రులు గుంతకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి కొనియాడారు. మండలంలోని కనుముకుల గ్రామంలో శనివారం నిర్వహించిన కోట మల్లారెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి వారు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ జెడ్పీ చైర్మన్లు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మల్లారెడ్డి చూపిన చొరవ మరువలేనిదని నేతలు పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక రంగాల్లో తనదైన ముద్ర వేసుకుని ప్రజల హృదయాల్లో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కందడి భూపాల్‌రెడ్డి, పాక మల్లేష్‌యాదవ్, పాక వెంకటేష్‌యాదవ్, రావుల శేఖర్‌రెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, పగిళ్ల సుధాకర్‌రెడ్డి, నోముల మాధవరెడ్డి, బత్తుల శ్రీశైలంగౌడ్, అందెల హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- హైదరాబాద్‌లో నేడు ఆత్మీయ సమ్మేళనం
- ఆర్యవైశ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన



**తొలివెలుగు, చిట్యాల :** హైదరాబాద్‌లో నేడు నిర్వహించనున్న ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని వనమా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

## క్రీడల్లో మెరిసిన టేకులసోమారం విద్యార్థులు

- మండల స్థాయి పోటీల్లో ప్రతిభ.. జిల్లా స్థాయికి పలువురు ఎంపిక
- కబడ్డీ, చెస్, వాలీబాల్‌లో సత్తా చాటిన విద్యార్థులు
- విజేతలకు హెచ్ఎం, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల అభినందనలు

**తొలివెలుగు, వలిగొండ :** మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాల్లో టేకులసోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వలిగొండలోని ఎస్వీ జెడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించిన 70వ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాల్లో విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటినట్లు పాఠశాల పిజికల్ డైరెక్టర్ ఎక్కలదేవి మల్లేశం తెలిపారు. 17 ఏళ్ల బాలికల కబడ్డీ, బాలుర చెస్ విభాగాల్లో టేకులసోమారం విద్యార్థులు ప్రథమ స్థానాలు సాధించారు. 14 ఏళ్ల బాలికల కబడ్డీతో పాటు 17 ఏళ్ల బాలురు, బాలికల వాలీబాల్ విభాగాల్లో ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ ప్రతిభతో ఆయా విభాగాల్లో పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పిజికల్ డైరెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ.కనకదుర్గ, గ్రామ సర్పంచ్ పడమటి మమత నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నారగొని అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చేగూరి పద్మమ్మ, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.







## గణేష్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- మండపాల నిర్వాహకులకు పోలీసుల అవగాహన సమావేశం
- ఉత్సవ, శాంతి కమిటీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం

**తొలివెలుగు, వలిగొండ :** గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసు, విద్యుత్ శాఖల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. శనివారం వలిగొండ పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ, శాంతి కమిటీ సభ్యులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులు నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మండపాల ఏర్పాటు సమయంలో వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమతించిన పరిమితికి లోబడి మాత్రమే సౌండ్ సిస్టమ్ వినియోగించాలని, నిర్ణీత సమయం దాటిన తర్వాత మైకులు వినియోగిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం సమయంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, శాంతి కమిటీ ప్రతినిధులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తాం

- ప్రజా సమస్యలపై పోరాటమే ఆయనకు నిజమైన నివాళి
- లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏచూరి కృషి మరువలేనిది
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్ :** సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అమరజీవి సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి అన్నారు. చౌటుప్పల్ సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమరజీవి కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సీతారాం ఏచూరి రెండో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో గొప్ప నాయకుడిగా, ప్రజా సమస్యలను లోతుగా అర్థం చేసుకున్న మేధావిగా గుర్తింపు పొందారని అన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థుల హక్కుల కోసం పోరాడిన ఏచూరి.. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడి అరెస్టయ్యారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏచూరి నిరంతరం గొంతెత్తారని తెలిపారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలోనూ ప్రజా సమస్యలను ఆధారాలతో, స్పష్టమైన వాదనతో సభలో వినిపించారని పేర్కొన్నారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తుండిపోతుందన్నారు. సీతారాం ఏచూరిని స్మరించుకోవడం అంటే కేవలం చిత్రపటానికి పూలమాల వేయడం కాదని, ఆయన చూపిన మార్గంలో ప్రజా సమస్యలపై పోరాడటమే నిజమైన నివాళి అని కృష్ణారెడ్డి అన్నారు. కార్మిక, కర్షక ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఉస్కాకుల శ్రీను, ఎండీ ఖయ్యూం, కందగట్ల ఆనంద్, పర్ని ధర్మారెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, బావుండ్లపల్లి స్వామి, ఎండీ రేష్మ, చికూరు ఈదయ, రాములు, చంద్రయ్య, పల్లె శివ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపం ఏర్పాట్లలో చిన్నారులతో పనులు?

- బంగారిగడ్డలో రక్షణ చర్యలు లేకుండానే స్టేజీ పనులు
- విద్యుత్ వైర్లు ఉన్న చోట చిన్నారులతో పని చేయించడంపై ఆందోళన
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బంగారిగడ్డలో సంతోషిమాత ఆలయ ఆవరణలో వినాయక చవితి ఉత్సవాల కోసం మండపం ఏర్పాట్లలో చిన్నారులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు అందుబాటులో లేకుండానే పాఠశాలకు వెళ్లాల్సిన వయసున్న చిన్నారులతో మండపం స్టేజీకి సంబంధించిన కర్రలు నాటిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. మండపం ఏర్పాట్లు జరుగుతున్న ప్రాంతంలో విద్యుత్ వైర్లు కూడా ఉన్నాయని, ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా చిన్నారులతో పనులు చేయించడం ప్రమాదకరమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకోకుండా విద్యుత్ ప్రమాదం జరిగితే చిన్నారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. చిన్నారులను ఇలాంటి ప్రమాదకర పనుల్లో వినియోగించడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. బాలల భద్రతకు సంబంధించిన నిబంధనలు ఉల్లంఘించారా అనే అంశంపై సంబంధిత బాలల సంక్షేమ అధికారులు, పోలీసు సిబ్బంది విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వినాయక మండపాల ఏర్పాట్లలో విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు చిన్నారులను ప్రమాదకర పనులకు దూరంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

# ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌కు చెక్

- భూలక్ష్మీనగర్‌లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం
- సీనియర్ సిటిజన్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స: మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి
- శిబిరాన్ని పరిశీలించిన మల్‌రెడ్డి రాంరెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి



**తొలివెలుగు, హయత్‌నగర్ :** సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా భూలక్ష్మీనగర్ కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి రోడ్లు, భవనాల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవ-జీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. వయోవృద్ధుల ఆరోగ్యంపై కుటుంబంతో పాటు సమాజం కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు వైద్య పరీక్షలు ఎంతో కీలకమని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నియంత్రించవచ్చన్నారు. సేవా దృక్పథంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన భూలక్ష్మీనగర్ కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను నాయకులు అభినందించారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలను మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించడం ద్వారా వయోవృద్ధులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, కార్యదర్శి సురేష్, అధికార ప్రతినిధి హరికిషన్‌తో పాటు కమలానగర్, ద్వారకామైనగర్, శారదానగర్, సుభద్రనగర్, హైకోర్టు కాలనీ, రాజప్పనగర్ ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

# రైతులకు కరెంట్ కష్టాలు తీర్చాలి

- సబ్‌స్టేషన్ ఎదుట భాజపా రాస్తారోకో.. స్తంభించిన వాహనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏలే చంద్రశేఖర్ ఆగ్రహం
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్





**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** పంటలు చేతికొచ్చే సమయంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ భాజపా మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో శనివారం పోచంపల్లి పురపాలక కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలే చంద్రశేఖర్ భాజపా శ్రేణులతో కలిసి ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో సుమారు గంటపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలో రైతులకు ఉచితంగా, నాణ్యమైన విద్యుత్ అందడం లేదని విమర్శించారు. విద్యుత్ కోతలు, నాణ్యత లేని సరఫరాతో పంటలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీరు రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు డబ్బీకార్ సాహిష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెరుకు వెంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, నాయకులు గంజి బసవలింగం, సీత మానస, పల్లికాడ బసవయ్య, శ్రీరామ్ మంజుల లింగస్వామి, బైర్ వెంకటేష్, కేసారం కృష్ణారెడ్డి, రచ్చ సత్యనారాయణ, తండ రమేష్, భూపాల్‌రెడ్డి, ముద్దం హరీష్, రామిడి యాదిరెడ్డి, గంగాపురం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌కు తరలుతున్న రేషన్ బియ్యం పట్టివేత



- 528 బస్తాల్లో 324 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం.. రూ.14.50 లక్షల విలువ
- లారీ సీజ్.. డ్రైవర్, క్లీనర్లు అదుపులోకి
- పుట్టగూడెం షెడ్డులో నిల్వ చేసి రాష్ట్రం దాటిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి

**తొలివెలుగు, రాజాపేట :** పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన యాదాద్రి భువనగిరి జిల్లా పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భారీగా బియ్యాన్ని పట్టుకున్నారు. రాజాపేట మండలం సింగారం గ్రామం వద్ద శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా వెళ్తున్న జాతీయ పర్మిట్ లారీని అడ్డుకుని తనిఖీ చేయగా 528 బస్తాల్లో 324 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. అధికారులు బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ. 14.50 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. డీఎస్‌వో రోజా వెల్లడించిన వివరాల ప్రకారం.. సింగారం వద్ద జాతీయ పర్మిట్ లారీ అనుమానాస్పదంగా కనిపించడంతో విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. విజిలెన్స్ విభాగం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీనివాస్ శుక్రవారం రాత్రి నుంచే లారీ కదలికలను గమనించారు. లారీ బయలుదేరిన అనంతరం దానిని అనుసరించి సింగారం వద్ద నిలిపి తనిఖీ చేయగా భారీగా బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగం ఓఎస్డీ ప్రభాకర్ బృందం, డీటీసీఎస్ నర్సింగరావు, ఆర్ఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. లారీలో ఉన్న బియ్యాన్ని పరిశీలించిన అధికారులు అది ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ బియ్యంగా నిర్ధారించి స్వాధీనం చేసుకున్నారు.

### షెడ్డులో నిల్వ చేసి తరలింపు?

ప్రాథమిక విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. పుట్టగూడెంలోని ఓ షెడ్డులో రేషన్ బియ్యాన్ని పెద్ద మొత్తంలో నిల్వ చేసి, అక్కడి నుంచి లారీలో గుజరాత్‌కు తరలిస్తున్నట్లు గుర్తించామని వెల్లడించారు. లారీని దేవ్‌సింగ్ అనే వ్యక్తి బుక్ చేసినట్లు డ్రైవర్, క్లీనర్ల సెల్‌ఫోన్లలో లభించిన సమాచారాన్ని బట్టి గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక మరెవరెవరి పాత్ర ఉందన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పుట్టగూడెం షెడ్డులో బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎంతకాలంగా నిల్వ చేస్తున్నారు? గతంలో ఇదే లారీ ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎన్నిసార్లు బియ్యం తరలించారు? ఈ వ్యవహారంలో మరెంతమంది ప్రమేయం ఉంది? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. అదుపులోకి తీసుకున్న లారీ డ్రైవర్, క్లీనర్లను రాజాపేట పోలీసులకు అప్పగించారు. రాజాపేట ఎస్సై తకియుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న 324 క్వింటాళ్ల బియ్యాన్ని ఆలేరు మండల స్థాయి గోదాముకు తరలించి భద్రపరిచారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



# భారీ ప్యాకేజీతో పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి: అచ్చెన్నాయుడు

**అచ్చెన్నాయుడిని కలిసిన పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు**

**పౌల్ట్రీ రంగం అభివృద్ధి కోసం రూ. 657 కోట్ల ప్యాకేజీ ప్రకటించామన్న అచ్చెన్న**

**ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడి**

**అమరావతి :**రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లో-టెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (ఈజ) పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

# సముద్ర గర్భంలో అపార సంపద..

**భారీగా బంగారం నిక్షేపాలు కనుగొన్న చైనా**

**పసిఫిక్ సముద్ర గర్భంలో బంగారం, వెండి గనులు**

**టన్నుకు 15.4 గ్రాముల బంగారం, 1271 గ్రాముల వెండి గుర్తింపు**

**చైనా ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలో ఈ నిల్వలు**

**ప్రపంచ స్థాయి నిక్షేపాలుగా మారే అవకాశం ఉందని అంచనా**

**వివిధ యూనివర్సిటీల శాస్త్రవేత్తల సంయుక్త పరిశోధనల్లో వెలుగు చూసిన నిజాలు**

చైనా శాస్త్రవేత్తలు సముద్ర గర్భంలో ఓ భారీ ఖనిజ నిధిని కనుగొన్నారు. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో చేపట్టిన పరిశోధనల్లో అత్యంత విలువైన బంగారం, వెండి నిక్షేపాలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు గుర్తించారు. భూమిపై లభించే గనులతో పోలిస్తే ఇక్కడ బంగారం, వెండి నిల్వలు గణనీయంగా అధిక స్థాయిలో ఉండటం విశేషం. సింఘువా యూనివర్సిటీ, షాంఘై జియావో టాంగ్ యూనివర్సిటీ సహా పలు సంస్థల పరిశోధకులు 'జియాంగ్ యాంగ్ హాంగ్ 10' అనే నౌకలో ఈ యాత్రను చేపట్టారు. సేకరించిన నమూనాలను నౌకలోని ల్యాబ్‌లోనే విశ్లేషించగా, ఆశ్చర్యపరిచే ఫలితాలు వచ్చాయి. ఇక్కడి ఖనిజాల్లో ప్రతి టన్నుకు 15.4 గ్రాముల వరకు బంగారం, 1,271 గ్రాముల వరకు వెండి ఉన్నట్లు తేలింది. ఈ నిక్షేపాలు చైనా ప్రత్యేక ఆర్థిక మండలి (ఈజ్జు) పరిధిలోని సముద్ర భాగంలో ఉన్నాయి. సముద్ర అంతర్భాగంలో 700 నుంచి 1,500 మీటర్ల లోతులో ఈ హైడ్రోథర్మల్ క్షేత్రం ఉంది. ఇక్కడ సముద్రపు నీటి ఉష్ణోగ్రత 315 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉన్నట్లు గుర్తించారు. మూడు పెద్ద శంఖాకార నిర్మాణాలతో ఉన్న ఈ ఖనిజ క్షేత్రం, భవిష్యత్తులో ప్రపంచ స్థాయి సముద్రగర్భ నిక్షేపంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండితో పాటు రాగి, ఇనుము, జింక్ వంటి ఇతర కీలక ఖనిజాలు కూడా ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. ఈ నిక్షేపాల పూర్తి స్థాయి పరిమాణం, ఆర్థిక ప్రయోజనాలను అంచనా వేయడానికి 2027లో మరింత కచ్చితత్వంతో కూడిన సర్వేలు చేపట్టాలని చైనా యోచిస్తోంది. అయితే, ఇంత లోతులో ఉన్న హైడ్రోథర్మల్ క్షేత్రాల నుంచి ఖనిజాలను వెలికితీయడం సాంకేతికంగా చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం ఇలాంటి మైనింగ్ కార్యకలాపాలు ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదు.

# లూజ్ సిమెంట్ దందా గుట్టురట్టు

**- చౌటుప్పల్‌లో రెండు చోట్ల పోలీసుల తనిఖీలు**

**- కేసు నమోదు చేసి దర్యాప్తు**



**తొలివెలుగు, చౌటుప్పల్ :**

అక్రమంగా లూజ్ సిమెంట్‌ను బస్తాల్లో నింపుతున్న ముఠాపై చౌటుప్పల్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సీఐ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో అందిన నమ్మదగిన సమాచారంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తంగేడు వనం వద్ద ఏఎస్సై పి. కరుణాకర్ జరిపిన తనిఖీల్లో సుమారు 82 బస్తాల లూజ్ సిమెంట్‌ను నింపుతుండగా గుర్తించారు. అదేవిధంగా హెడ్ కానిస్టేబుల్ ఎ. సైదయ్య మరో ప్రాంతంలో జరిపిన తనిఖీల్లో 25 బస్తాల లూజ్ సిమెంట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రెండు ప్రాంతాల్లో కలిపి 107 బస్తాల లూజ్ సిమెంట్‌ను జప్తు చేశారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న సూత్రధారులు, సిమెంట్ మూలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ వెల్లడించారు.

# బ్రిక్స్ నేతలకు మోదీ ఆతిథ్యం.. పూర్తిగా శాకాహార విందు!

**భారతీయ వంటకాల వైవిధ్యంతో మెనూ రూపకల్పన**

**విందులో స్టార్టర్ల నుంచి డెజర్ట్‌ల వరకు నోరూరించే వీగన్ రుచులు**

**ఆహారంతో పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన**

**బ్రిక్స్ సభ్య దేశాల కళాకారులతో 'వన్ రిథమ్, మెనీ కల్చర్స్' సింఫనీ**



ప్రధాని నరేంద్ర మోదీ ఆతిథ్యంలో జరిగిన బ్రిక్స్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంపూర్ణ శాకాహార విందుతో అపూర్వంగా నిలిచింది. శనివారం రాత్రి ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ గాలా డిన్నర్‌లో పాల్గొన్న దేశాధినేతలు, ఉన్నతాధికారులకు భారతీయ పాకశాస్త్ర వైవిధ్యాన్ని, సుస్థిర విలువల ప్రాధాన్యాన్ని చాటిచెప్పేలా ఈ విందును రూపొందించారు. కేవలం రుచికే కాకుండా, పర్యావరణ స్పృహ, సమ్మిళితత్వం, సంపూర్ణ ఆరోగ్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని మెనూను తీర్చిదిద్దడం విశేషం. ఈ బహుళ వంటకాల శాకాహార విందులో ప్రతి వంటకం ఒక ప్రత్యేకతను చాటుకుంది. విందు ప్రారంభంలో అతిథులకు అద్భుతమైన స్టార్టర్స్ అందించారు. గుజరాతీ సంప్రదాయ వంటకమైన ఖాండ్వీని 'ఖాండ్వీ మిల్లె-ఫ్యూయెల్' పేరుతో ఆధునికంగా తీర్చిదిద్దారు. శెనగపిండితో ఆవిరిపై ఉడికించిన ఈ సున్నితమైన రోల్స్‌పై ఆవాలు, కొబ్బరి, కరివేపాకుతో తాలింపు పెట్టి, కుంకుమపువ్వు మామిడి, మైక్రో-గ్రీన్స్, తేలికపాటి పెరుగు తరహా డ్రెస్సింగ్‌తో వడ్డించారు. దీనితో పాటు, 'ఖుంబ్ గలౌటీ' పేరుతో సున్నితమైన పుట్టగొడుగుల కబాబ్‌లను పుదీనా ముత్యాలతో షీర్మల్ బ్రెడ్‌పై అందించి ఆకట్టుకున్నారు. ఇక ప్రధాన భోజనంలో ఉత్తర, దక్షిణ భారత రుచుల సంగమం కనిపించింది. మొక్కల ఆధారిత పదార్థాలతో తయారు చేసిన పనీర్‌తో 'పనీర్ లబబ్దార్'ను ఘుమఘుమలాడే ఉల్లి-టొమాటో గ్రేవీలో వడ్డించారు. హిమాలయాల్లో లభించే అరుదైన గుచ్చి పుట్టగొడుగులు, ఆస్పరాగస్‌లను కుంకుమపువ్వు, ఎండుద్రాక్ష, మామ్రా బాదంపప్పులతో కలిపి వండిన 'గుచ్చి మర్మిక్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దక్షిణాది సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ, వర్జిన్ కొబ్బరి నూనెతో వండిన 'క్యారెట్ బీన్స్ పొరియల్', తాజా కొబ్బరి తురుముతో రుచికరంగా వడ్డించారు. వీటికి తోడుగా టొమాటో, కందిపప్పు, కరివేపాకుతో చేసిన 'తక్కాళి బెల్లె సారు', సువాసనభరితమైన బాస్మతి బియ్యం, సిరిధాన్యాలతో వండిన 'మిల్లెట్ పులావ్' భోజనానికి పరిపూర్ణతను చేకూర్చాయి. చల్లటి బీట్‌రూట్ రైతా, వివిధ రకాల భారతీయ రొట్టెలను కూడా వడ్డించారు. భోజనం చివరలో అందించిన డెజర్ట్‌లు ఈ విందును చిరస్మరణీయం చేశాయి. 'ఓల్డ్ ఢిల్లీ ఫ్రూట్ క్రీమ్ విత్ జిలేబీ' పేరుతో తాజా పండ్లను తేలికపాటి క్రీమ్‌తో కలిపి, కరకరలాడే జిలేబితో అందించారు. నెమ్మదిగా ఉడికించిన బియ్యం, పాలతో చేసిన 'షహతూత్ ఫిర్నీ'పై షహతూత్ పండ్లు, బంగారు రేకుతో అలంకరించి వడ్డించడం రాజరికపు ఆతిథ్యాన్ని గుర్తుకు తెచ్చింది. ఈ విందు కేవలం భోజనానికే పరిమితం కాలేదు. అదే సమయంలో 'నవరస - భావోద్వేగాల విశ్వం' పేరిట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఇందులో భాగంగా 'బ్రిక్స్ సింఫనీ -- ఒకే లయ, అనేక సంస్కృతులు' పేరిట బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల సంగీతకారులు కలిసి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. విభిన్న సంగీత సంప్రదాయాలు, వాయిద్యాలను భారతీయ శాస్త్రీయ నృత్యంతో మేళవించి, విభిన్న నాగరికతలను కలిపే సార్వత్రిక బంధాలను ఇది ప్రతిబింబించింది. 'కలిసి మెరుగైన ప్రపంచాన్ని నిర్మించుకుందాం' అనే స్ఫూర్తిని ఈ సాంస్కృతిక మార్పిడి చాటిచెప్పింది. మొత్తం మీద, ఈ కార్యక్రమం భారతీయ సంస్కృతి, పాకశాస్త్ర గొప్పతనాన్ని ప్రపంచ వేదికపై బలంగా ఆవిష్కరించింది.

# న్యూఢిల్లీ డిక్లరేషన్.. ఐరాస నుంచి గాజా వరకు.. బ్రిక్స్ కీలక తీర్మానాలు

**ఐరాస భద్రతామండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సంస్కరణలకు మద్దతు**

**ఏకపక్ష ఆంక్షలు, సుంకాలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలకు వ్యతిరేకత**

**గాజాలో కాల్పుల విరమణ, మానవతా సాయం కొనసాగాలని డిమాండ్**

**జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం**

**ఉగ్ర నిధులు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో సహకారానికి పిలుపు**



న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పిలుపునిచ్చాయి. ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు అంతర్జాతీయ సంస్థల్లో ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలని స్పష్టం చేశాయి. ప్రపంచ వ్యవస్థ మరింత ప్రజాస్వామ్యబద్ధంగా, బహుళ ధ్రువంగా మారాలని బ్రిక్స్ నేతలు ఆకాంక్షించారు.

### ఐరాసలో సంస్కరణలకు మద్దతు

ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సంస్కరణలకు బ్రిక్స్ మరోసారి మద్దతు తెలిపింది. భారత్, బ్రెజిల్‌కు ఐరాసలో, ముఖ్యంగా భద్రతామండలిలో, మరింత కీలక పాత్ర కల్పించాలన్న ఆకాంక్షలకు చైనా, రష్యా మద్దతు తెలిపిన విషయాన్ని ప్రకటనలో స్వాగతించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సహా బ్రెట్టన్ వుడ్స్ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ఓటింగ్ హక్కు, నిర్ణయాధికారం పెరగాలని కోరారు. ఐరాసలో ఉన్నత పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరగాలని పేర్కొన్నారు.

### ఆంక్షలు, వాణిజ్య అడ్డంకులపై ఆగ్రహం

ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాలపై విధించే ద్వితీయ ఆంక్షలను బ్రిక్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఆహార భద్రత, ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంది. ఏకపక్ష సుంకాలు, పన్నేతర ఆంక్షలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలు ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో వివాద పరిష్కార వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరింది. డబ్ల్యూటీవో అప్పిలేట్ బాడీలో కొత్త సభ్యుల నియామకానికి మద్దతు తెలిపింది.

### గాజాపై స్పష్టమైన వైఖరి

అంతర్జాతీయ వివాదాలకు యుద్ధం కాకుండా చర్చలు, దౌత్యం, మధ్యవర్తిత్వమే పరిష్కార మార్గాలని బ్రిక్స్ పేర్కొంది. గాజాలో కాల్పుల విరమణ కొనసాగాలని, మానవతా సాయం ఎలాంటి అడ్డంకులు లేకుండా అందాలని కోరింది. పాలస్తీనియన్లను బలవంతంగా తరలించడాన్ని ఆపాలని, పౌరులు, పౌర మౌలిక వసతులకు రక్షణ కల్పించాలని స్పష్టం చేసింది. 1967 సరిహద్దుల ఆధారంగా రెండు దేశాల పరిష్కారానికి మద్దతు తెలిపింది. తూర్పు జెరూసలేం పాలస్తీనా రాజధానిగా ఉండాలని పేర్కొంది. ఐరాసలో పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వానికి మద్దతు ఇచ్చింది. లెబనాన్‌లో కాల్పుల విరమణను స్వాగతిస్తూ ఐరాస తీర్మానం 1701 అమలు చేయాలని కోరింది.

### సూడాన్, సిరియాపైనా కీలక పిలుపు

సూడాన్‌లో తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ జరగాలని బ్రిక్స్ కోరింది. ప్రజలకు మానవతా సాయం అందించేందుకు అడ్డంకులు తొలగించాలని పేర్కొంది. సమస్యకు ఆఫ్రికా దేశాలే పరిష్కారం చూపాలన్న విధానాన్ని సమర్థించింది. సిరియాలో ఆ దేశ ప్రజల ఆధ్వర్యంలో, ఐరాస సహకారంతో రాజకీయ ప్రక్రియ కొనసాగాలని తెలిపింది. ఆక్రమణ దళాలు అక్కడి నుంచి వెళ్లిపోవాలని పిలుపునిచ్చింది.

### ఉగ్రవాదంపై కఠిన నిర్ణయం

ఉగ్రవాదానికి ఎలాంటి మినహాయింపులు ఉండకూడదని బ్రిక్స్ స్పష్టం చేసింది. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని ఖండించింది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఆ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఖండించింది. ఐరాసలో సమగ్ర అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక ఒప్పందాన్ని త్వరగా ఆమోదించాలని కోరింది. ఉగ్రవాదానికి నిధులు, మానవ అక్రమ రవాణా, ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు దేశాల మధ్య సహకారం పెరగాలని సూచించింది. డ్రగ్స్ ద్వారా జరిగే మనీలాండరింగ్, సైబర్ నేరాలు, అక్రమ వర్చువల్ ఆస్తుల లావాదేవీలపైనా దృష్టి పెట్టాలని పేర్కొంది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్‌లను ఎదుర్కొనేందుకు సమన్వయం పెంచాలని తెలిపింది. ఆస్తుల రికవరీ, పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, సరిహద్దులు దాటి జరిగే అవినీతిని అడ్డుకునే కొత్త సహకార విధానాలను కూడా బ్రిక్స్ స్వాగతించింది.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి

**రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి**

**ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి**

**డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి**



ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరోజు ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జీఖూ) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.




# మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్: తన ఏఐ డ్యాన్స్ వీడియోపై కేరళ సీఎం సరదా వ్యాఖ్య

**తన డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయానన్న కేరళ సీఎం**
**మోహన్‌లాల్, విజయ్ కంటే తానే బాగా డ్యాన్స్ చేశానని సరదా వ్యాఖ్య**
**కేరళలో విద్యుత్ సంక్షోభంపై విమర్శల నడుమ వైరల్ అయిన వీడియో**
**వినోదం కోసమేనని, ఎవరినీ కించపరచలేదని స్పష్టం చేసిన క్రియేటర్లు**
**డిజిటల్ టెక్నాలజీ సవాళ్లపై జరిగిన సెమినార్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు**

కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్ ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, “ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది” అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన ‘జైలర్ 2’ చిత్రంలోని ‘అల బొలెలో’ పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ఎక్కువ మంది పిల్లలను కనాలన్న సీఎం చంద్రబాబు.. విజయసాయిరెడ్డి స్పందన

**పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చులు, సౌకర్యాలపైనే కుటుంబాలు నిర్ణయం తీసుకుంటాయని స్పష్టీకరణ**
**విజ్ఞప్తులు చేయడం కాకుండా, పిల్లల పెంపకాన్ని సులభతరం చేయాలని ప్రభుత్వానికి సూచన**

రాష్ట్రంలో యువత ఎక్కువ మంది పిల్లల్ని కనాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విజ్ఞప్తిపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. కేవలం ముఖ్యమంత్రి పిలుపునిచ్చినంత మాత్రాన ప్రజలు ఎక్కువ మంది పిల్లల్ని కనరని, అందుకు అనువైన పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్లోని వైరుధ్యాన్ని విజయసాయిరెడ్డి ప్రస్తావించారు. “ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒకే సంతానం, ఆయన కుమారుడికి కూడా ఒకే సంతానం. అలాంటప్పుడు ఇతరులను ఎక్కువ మంది పిల్లల్ని కనమని కోరడం హాస్యాస్పదంగా ఉంది” అని ఆయన విమర్శించారు. ప్రజలు పిల్లల్ని కనాలనే నిర్ణయాన్ని సీఎం విజ్ఞప్తుల ఆధారంగా తీసుకోరని, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటారని స్పష్టం చేశారు. కుటుంబాలు పిల్లల భవిష్యత్తు గురించి తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేసే అంశాలను విజయసాయిరెడ్డి తన పోస్టులో వివరించారు. “తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం, మంచి నివాసం, సంరక్షణ అందించగలమా లేదా అనే ఆర్థిక స్థోమతను బట్టి నిర్ణయాలు తీసుకుంటారు. అంతేకాకుండా, ఉద్యోగ జీవితం, కుటుంబ బాధ్యతలను సమన్వయం చేసుకోగలమా అన్నది కూడా ఆలోచిస్తారు” అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో జననాల రేటు క్షీణతపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కేవలం విజ్ఞప్తులు చేయడం పరిష్కారం కాదని విజయసాయిరెడ్డి సూచించారు. “పిల్లల పెంపకాన్ని సులభతరం చేసేలా, మరింత అందుబాటులోకి తెచ్చేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలి. తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టినప్పుడే వారు ఎక్కువ మంది పిల్లల గురించి ఆలోచించగలరు” అని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు.



# జైలులో ప్రజ్వల్ రేవణ్ణ ఫోన్‌లో 173 పోర్న్ వీడియోలు.. నిర్ధారించిన ఫోరెన్సిక్ ల్యాబ్

**మూడు వీడియోలు ప్రజ్వల్‌కు సంబంధించినవిగా అనుమానం**
**పెన్‌డ్రైవ్‌లో 150కి పైగా వీడియోలు ఉన్నట్లు వెల్లడి**
**పలువురు మహిళలకు వాట్సాప్, వీడియో కాల్స్ చేసినట్లు గుర్తింపు**
**కొందరు మహిళలకు నోటీసులు ఇచ్చే యోచనలో పోలీసులు**
**జైలు వార్డర్ ఫోన్ అందించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది**



మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జైలు గదిలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో వందలాది పోర్న్ వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నిర్ధారించింది. మొత్తం 173 వీడియో ఫైళ్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాటిలో ప్రజ్వల్‌కు సంబంధించినవిగా భావిస్తున్న మూడు అశ్లీల వీడియోలు ఉన్నట్లు సమాచారం. బెంగళూరు కేంద్ర కారాగారంలో ఆగస్టు 11న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రజ్వల్ రేవణ్ణ, మరో ఖైదీ ప్రతాప్ రాయ్ ఉంటున్న గదిలో మొబైల్ ఫోన్ దొరికింది. పాస్‌వర్డ్ చెప్పేందుకు ఇద్దరూ నిరాకరించడంతో ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. తాజాగా వచ్చిన నివేదికలో వీడియో ఫైళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది. మొబైల్‌లో కన్నడ, హిందీ, ఇంగ్లిష్ సినిమాల క్లిప్పులు, వెబ్‌సిరీస్ వీడియోలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పెన్‌డ్రైవ్‌లోనూ 150కి పైగా వీడియోలు ఉన్నట్లు వెల్లడైంది. వాటినీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఫోన్‌లో వాట్సాప్, వీడియో కాల్స్ జరిగినట్లు కాల్ రికార్డుల పరిశీలనలో తేలింది. పలువురు మహిళలతో సంప్రదింపులు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రజ్వల్‌తో గతంలో కొన్ని వీడియోల్లో కనిపించిన కొందరు మహిళలతో జరిగిన కాల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అవసరమైతే వారికి నోటీసులు ఇచ్చి ప్రశ్నించే అవకాశం ఉంది. జైలులో ఉన్న సమయంలో ప్రజ్వల్ కుటుంబ సభ్యులతో తరచూ మాట్లాడినట్లు దర్యాప్తులో తేలింది. తన న్యాయవాదితోనూ ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. ఇక హైసెక్యూరిటీ జైలులోకి ఫోన్ ఎలా చేరిందన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఓ జైలు వార్డర్ ప్రజ్వల్‌కు ఫోన్ అందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. తౌసీఫ్ అనే రౌడీషీటర్ పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. డిజిటల్ ఆధారాలు, కాల్ రికార్డులు, జైలు సిబ్బంది వాంగ్మూలాలతో దర్యాప్తును కొనసాగిస్తున్నారు.




# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ...

**కొండా సురేఖ తొలగింపుపై తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు**
**తెలంగాణ భవన్‌లో ‘నమూనా అసెంబ్లీ’ నిర్వహించిన బీఆర్ఎస్**
**సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు మాజీ మంత్రి కొండా సురేఖ తొలగింపుపై తలసాని సెటైర్లు**
**100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్**
**అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం**

కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ‘మాక్ అసెంబ్లీ’ నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, “కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?” అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. “100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా” అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

# లైంగిక వేధింపుల ఆరోపణలు.. ‘ఢీ-10’ డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్



తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ‘ఢీ-10’ డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# చైనా అధ్యక్షుడి విమానం.. గాల్లో ఎగిరే కోట!




**చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రయాణించే బోయింగ్ 747-8 విమానం**
**ఇది కేవలం విమానమే కాదు.. ఒక మొబైల్ కమాండ్ సెంటర్**
**అత్యాధునిక మిస్సైల్ నిరోధక, కమ్యూనికేషన్ వ్యవస్థల ఏర్పాటు**
**సాధారణ విమానాన్ని అత్యంత శక్తిమంతంగా మార్పులు**
**అధ్యక్షుడు, ప్రీమియర్ మాత్రమే వినియోగించేందుకు అనుమతి**

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారిక పర్యటనలకు ఉపయోగించే విమానం కేవలం ఒక రవాణా సాధనం కాదు. అది గాల్లో తేలియాడే ఒక అభేద్యమైన కోట, అత్యాధునిక మొబైల్ కమాండ్ సెంటర్. ఎయిర్ చైనా సంస్థ నిర్వహించే ఈ బోయింగ్ 747-8 ఇంటర్‌కాంటినెంటల్ విమానాన్ని, చైనా అత్యున్నత స్థాయి నేతల ప్రయాణాల కోసం, అత్యవసర సమయాల్లో ఆదేశాలు జారీ చేసే కేంద్రంగా పనిచేసేలా ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ విమానంలో ఆయన బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చారు. దాంతో ఈ భారీ విమానంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఈ విమానం ఒకప్పుడు ఎయిర్ చైనాకు చెందిన సాధారణ వాణిజ్య విమానం. 2014 చివర్లో ప్రయాణికుల సేవలో ప్రవేశపెట్టారు. కానీ, కేవలం కొన్ని నెలలకే, అంటే మే 2015లో, దీనిని శాశ్వతంగా వాణిజ్య సేవల నుంచి ఉపసంహరించారు. ఆ తర్వాత దీనికి అత్యాధునిక భద్రతా వ్యవస్థలను, విలాసవంతమైన వీఐపీ ఇంటీరియర్‌ను అమర్చేందుకు నెలల తరబడి విస్తృతమైన మార్పులు చేశారు. అన్ని మార్పుల తర్వాత 2016 శరదృతువులో ఇది చైనా అధ్యక్షుడి ప్రాథమిక అధికారిక విమానంగా సేవలు ప్రారంభించింది.

ఈ విమానంలో ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా సాంకేతికతను అమర్చారు. ప్రభుత్వ, సైనిక కమాండ్ సెంటర్లతో అధ్యక్షుడు నిరంతరం టచ్‌లో ఉండేందుకు వీలుగా మిలిటరీ-గ్రేడ్ ఎన్‌క్రిప్టెడ్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉన్నాయి. శత్రు క్షిపణులను పసిగట్టి, వాటిని దారి మళ్లించే రక్షణ వ్యవస్థలు దీని సొంతం. అన్నింటికంటే ముఖ్యంగా, దీనిలో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ పల్స్ (ఇఎంపీ) షీల్డింగ్ టెక్నాలజీ ఉంది. అణు దాడి జరిగినప్పుడు వెలువడే శక్తివంతమైన విద్యుదయస్కాంత తరంగాల నుంచి విమానంలోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ వ్యవస్థలను ఇది కాపాడుతుంది. అంటే, అణు యుద్ధం స్థాయిలోనే ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ జరిగినా ఈ విమానం చెక్కుచెదరకుండా పనిచేస్తూనే ఉంటుంది.

**గత అనుభవాలతో పటిష్ఠమైన నిర్మాణం**

గతంలో, చైనా నేతలు విదేశీ పర్యటనలకు వెళ్లేటప్పుడు సాధారణ వాణిజ్య విమానాలనే తాత్కాలికంగా మార్పులు చేసి వాడేవారు. పర్యటనకు 20 రోజుల ముందు విమానాన్ని తీసుకుని, అందులో సోఫాలు, పడకలు అమర్చి వీవీఐపీ క్యాబిన్‌గా మార్చేవారు. పర్యటన ముగిశాక తిరిగి సాధారణ విమానంగా మార్చేసేవారు. ఇది ఖర్చును ఆదా చేసే పద్ధతి. 2001లో అమెరికాలో ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించుకున్న అధ్యక్ష విమానంలో 27 గూఢచర్య పరికరాలు (శ్రీఆర్వఅఆఅస్త్ర ఎవజఆఏవం) ఉన్నట్లు కథనాలు రావడం చైనాను అప్రమత్తం చేసింది. ఆ సంఘటన తర్వాతే తమ దేశాధినేతల భద్రత విషయంలో చైనా మరింత కఠినంగా వ్యవహరించడం మొదలుపెట్టింది. ప్రస్తుతం జిన్ పింగ్ ఉపయోగిస్తున్న ఈ ప్రత్యేక విమానం పొడవు 76.4 మీటర్లు. ఇది గంటకు 982 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఒక్కసారి ఇంధనం నింపితే సుమారు 14,500 కిలోమీటర్లు ఆగకుండా ప్రయాణించగలదు. ఈ విమానాన్ని కేవలం చైనా అధ్యక్షుడు, స్టేట్ కౌన్సిల్ ప్రీమియర్ మాత్రమే ఉపయోగించడానికి అనుమతి ఉంది. ఇతర నేతలు చార్టర్డ్ విమానాల్లో ప్రయాణిస్తారు. ఒకప్పుడు ఖర్చు తగ్గించుకునేందుకు సాధారణ విమానాలు వాడిన చైనా, ఇప్పుడు ప్రపంచ వేదికపై తన పెరిగిన ప్రాబల్యానికి, భద్రత పట్ల తనకున్న నిబద్ధతకు చిహ్నంగా ఈ ‘ఎగిరే కోట’ను వినియోగిస్తోంది.




# సిప్.. రికార్డ్ హై

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా పెట్టుబడులు రికార్డ్ స్థాయికి చేరాయి. గత నెల ఆగస్టులో రూ.32,297 కోట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు నెల జూలైలో రూ.31, 961 కోట్లుగా ఉన్నట్టు గురువారం విడుదలైన భారతీయ మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్ (యాంఫీ) గణాంకాల్లో తేలింది. ఇక నిరుడు ఆగస్టులో రూ.28,265 కోట్లుగా ఉండగా, అప్పటితో పోల్చితే ఈసారి దాదాపు 14 శాతం వృద్ధి కనిపించింది. పెట్టుబడులు ప్రారంభించండి తాజా పెరుగుదలతో ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి 5 నెలల్లో (ఏప్రిల్-ఆగస్టు) దాదాపు రూ.1.6 లక్షల కోట్లకు చేరాయి. ఇదిలావుంటే ఈ ఆగస్టులో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ స్కీములు రూ.29,329 కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించాయి. ఇది గడిచిన 4 నెలల్లో అత్యధికం. స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులున్నా.. మదుపర్లు మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ట్రేడర్లు చెప్తున్నారు. జూలైలో రూ.24,697 కోట్లుగా ఉన్నట్టు యాంఫీ వెల్లడించింది.

# కొత్త ఈ-కామర్స్ రూల్స్

**వచ్చే ఏడాది జనవరి నుంచి అమలు**



న్యూఢిల్లీ:కేంద్ర ప్రభుత్వం ఈ-కామర్స్ వినియోగదారుల రక్షణ నిబంధనలు-2020ని సవరించింది. ధరల్లో పారదర్శకత దగ్గర్నుంచి డార్క్ ప్యాటర్న్లు కట్టడిదాకా అన్ని రూల్స్‌ను కఠినతరం చేసినట్టు గురువారం వినియోగదారుల వ్యవహారాల శాఖ తెలియజేసింది. ఈ క్రమంలోనే నూతన కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఈ-కామర్స్) అమెండ్‌మెంట్ రూల్స్-2026 వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయని ఓ ప్రకటనలో తెలిపింది. నానాటికీ ఆన్‌లైన్ షాపింగ్ విస్తృతమవుతున్న నేపథ్యంలో అమాయక కస్టమర్లను కేటుగాళ్లు నిండా ముంచుతున్న విషయం తెలిసిందే. అధిక ధరలు వసూలు చేయడం, నాసిరకం వస్తూత్పత్తులను అంటగట్టడం, ఒకటి చూపించి మరొకటి పంపడం, రిటర్న్-రిఫండ్‌కు ఇబ్బందులు పెట్టడం వంటివి తరచూ చూస్తూనే ఉన్నాం. దీంతోనే వినియోగదారుల రక్షణార్థం కొత్త రూల్స్‌ను తెచ్చామని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

# టాటా పంచ్ మరింత ప్రియం.. రూ 20 వేల వరకు రేటు పెంచిన సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఈవీ మాడళ్లలో ఒకటైన పంచ్ ఈవీ ధరను మరోసారి పెంచింది టాటా. ఈ మాడల్ ధరను రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సవరిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతో ఈ కారు ధర రూ.9.79 లక్షల నుంచి రూ.12.99 లక్షల మధ్యలోకి చేరుకున్నది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మార్కెట్లోకి విడుదల చేసినప్పుడు ఈ కారు ధర రూ.9.69 లక్షలుగా ఉండేది. వీటిలో 30 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధరను రూ.10 వేలు పెంచిన సంస్థ.. 40 కిలోవాట్ల బ్యాటరీ మాడల్‌ను రూ.20 వేలు సవరించింది. సింగిల్‌చార్జింగ్‌తో 30 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 375 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 40 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 468 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో ఈవీ, సిట్రాయిన్ ఈసీ3, ఎంజీ కొమ్మెట్ ఈవీ, విండ్‌సర్ ఈవీలకు పంచ్ గట్టి పోటీనివ్వనున్నది.




# దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి

**ఇప్పటిదాకా రూ.2.80 లక్షల కోట్లు ఉపసంహరణ**



న్యూఢిల్లీ, దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) తమ పెట్టుబడులను పెద్ద ఎత్తున వెనుకకు తీసుకుంటున్నారు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దాదాపు రూ.2.80 లక్షల కోట్ల పెట్టుబడులను ఎఫ్ఐఐలు ఉపసంహరించుకున్నారు. గత ఏడాది రూ.2.39 లక్షల కోట్లు వెనక్కి తీసుకోగా.. 2024లో రూ.1.28 లక్షల కోట్లు తరలిపోయాయి. అయితే 2025లో సుమారు రూ.74,000 కోట్లు, 2024లో దాదాపు రూ.1.21 లక్షల కోట్ల పెట్టుబడులనూ తీసుకొచ్చారు. దీంతో నిరుడు రూ.1.65 లక్షల కోట్లు, అంతకుముందు ఏడాది రూ.7,000 కోట్లు పడిపోయినెట్టైంది. ఈ ఏడాది ఇది ఏకంగా రూ.2.33 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. రూ.47,000 తిరిగి తెచ్చారు మరి.

**ఐపీవోలపై ఆసక్తి**

స్టాక్ మార్కెట్లలో ఇప్పటికే నమోదైన సంస్థల్లో నుంచి పెట్టుబడులను లాగేసుకునే పనిలోపడ్డ ఎఫ్ఐఐలు.. కొత్తగా నమోదవుతున్న కంపెనీలపట్ల మాత్రం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో)లో రూ.47,000 కోట్ల పెట్టుబడులను పెట్టడం ఇందుకు నిదర్శనం. నూతన రంగాల్లోకి ప్రవేశించాలన్న కోరికతోపాటు, షేర్ల ధరలు తక్కువగా ఉండటంతో మెజారిటీ ఎఫ్ఐఐలు ఇప్పుడు పాత షేర్లను అమ్ముకుని కొత్త షేర్లను చౌకగా దక్కించుకోవడంపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులకు మార్కెట్ లిస్టెడ్ షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం, అమ్మకాల ఒత్తిడికి గురవుతుండటం.. ఇన్వెస్టర్లకు నష్టాలను మిగులుస్తున్నాయి. దీంతోనే నయా కంపెనీలపై ఆసక్తి కనబరుస్తున్నారని మార్కెట్ నిపుణులు ప్రస్తుత ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

**వైవిధ్యం చూపుతూ..**

ఎఫ్ఐఐలు భారతీయ స్టాక్ మార్కెట్లలో బ్యాంకింగ్, ఐటీ సర్వీసెస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో భారీగా పెట్టుబడులు పెట్టారు. అయితే ఇప్పుడు ఈ రంగాల్లో వృద్ధి పరిమితంగానే తయారైంది. దీంతో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, కన్స్యూమర్ టెక్నాలజీ, రెన్యువబుల్స్, క్యాపిటల్ మార్కెట్ వ్యాపారాల్లో పెట్టుబడులపై దృష్టిసారిస్తున్నారు. అందుకే ఈ రంగాలకు చెందిన సంస్థలు ఐపీవోలకు వచ్చినప్పుడు భారీగా షేర్ల కొనుగోలుకు దిగుతున్నారని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్న మాట.

ఇక త్వరలో జియో ప్లాట్‌ఫామ్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ), ఫోన్‌పే, ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ పబ్లిక్ ఇష్యూలు రాబోతున్నాయి. దీంతో మార్కెట్ చూపంతా వీటిపైనే ఉన్నదిప్పుడు. ఈ ఏడాది జనవరి-ఆగస్టు మధ్య ఆర్థిక సేవల రంగం నుంచి లక్ష కోట్లు దాటిన ఎఫ్ఐఐలు ఉపసంహరించుకున్న పెట్టుబడుల విలువ. ఆటో, చమురు-గ్యాస్, ఎఫ్ఎంసీజీ, టెలికాం, ఐటీ రంగాల నుంచి రూ.25,000 కోట్ల చొప్పున తరలిపోయిన పెట్టుబడులు.

# భారత రోడ్లపై పుతిన్ కారు.. ప్రత్యేకతలు ఇవే!


రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన మరోసారి ఆయన ప్రత్యేక భద్రతా ఏర్పాట్లపై ఆసక్తిని పెంచింది. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు న్యూఢిల్లీకి చేరుకున్న పుతిన్ వెంట భారీ భద్రతా కాన్వాయ్ కూడా వచ్చింది. ఆయన ప్రయాణించే ప్రత్యేక అధ్యక్ష విమానంతో పాటు, అత్యంత భద్రతతో కూడిన ఆరస్ సెనాట్ (ూబతీబం ాావఅఫ్) లిమోసిన్ కూడా విదేశీ పర్యటనలకు తరలించడం రష్యా అధ్యక్షుడి భద్రతా వ్యవస్థలో కీలక భాగంగా మారింది. ప్రపంచ దేశాల అధినేతలు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు స్థానికంగా ఏర్పాటు చేసిన అధికారిక వాహనాలను ఉపయోగించడం సాధారణం. అయితే పుతిన్ మాత్రం విదేశీ పర్యటనల్లోనూ తన కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఆరస్ సెనాట్ వాహనాన్నే వినియోగిస్తారు. అత్యాధునిక రక్షణ వ్యవస్థలతో కూడిన ఈ లిమోసిన్‌ను అందుకే 'ఫోర్ట్రెస్ ఆన్ వీల్స్'గా అభివర్ణిస్తుంటారు. పుతిన్ కాన్వాయ్‌లో సాధారణంగా భారీ సంఖ్యలో వాహనాలు ఉంటాయి. విదేశీ పర్యటనల సమయంలో మాత్రం




ఆయన ప్రయాణించే ఆరస్ సెనాట్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. బుల్లెట్ ప్రూఫ్, పేలుళ్లను తట్టుకునే సామర్థ్యం వంటి రక్షణ వ్యవస్థలతో ఈ కారును రూపొందించినట్లు తెలుస్తోంది. ఆరస్ సెనాట్‌ను రష్యాకు చెందిన ఆరస్ మోటార్స్ అభివృద్ధి చేసింది. రష్యన్ స్టేట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నామి, సోలర్స్ జేఎస్సీ, యూఏఈకి చెందిన తవాజున్ హోల్డింగ్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. రష్యా ప్రభుత్వం దేశీయంగా అత్యాధునిక లగ్జరీ, రక్షణ వాహనాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన 'కోర్టెజ్' ప్రాజెక్టులో భాగంగా సెనాట్ రూపొందింది. 2018లో ఈ మోడల్‌ను పరిచయం చేశారు. దీని డిజైన్‌కు సోవియట్ కాలం నాట్గి×ూా-110 లిమోసిన్ నుంచి స్ఫూర్తి పొందినట్లు చెబుతారు. పుతిన్ ఉపయోగించే ఆరస్ సెనాట్‌లో 4.4 లీటర్ ట్విన్ టర్బోచార్జ్ ఎ8 ఇంజిన్, హైబ్రిడ్ వ్యవస్థతో కలిపి పనిచేస్తుంది. ఇది సుమారు 598 హార్స్‌పవర్, 880 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 9-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో ఈ కారు పనిచేస్తుంది. సెనాట్ పొడవు సుమారు 5,630 మిల్లీమీటర్లు, వెడల్పు 2,000 మిల్లీమీటర్లు, ఎత్తు 1,700 మిల్లీమీటర్లుగా ఉంటుంది. గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగల ఈ లిమోసిన్.. 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని సుమారు 9 సెకన్లలో చేరగలదని సమాచారం.

# ఏఐరేసులో భారత్.. పెట్టుబడుల్లో భారీ వృద్ధి!

భారతదేశంలో ఏఐ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో.. పలు కంపెనీలు ఈ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. సర్వీస్‌నౌ విడుదల చేసిన ఎంటర్‌ప్రైజ్ ఏఐ మెచ్యూరిటీ ఇండెక్స్ 2026 ప్రకారం.. దేశీయ సంస్థల్లో ూా×పై పెట్టుబడులు ఒక్క సంవత్సరంలోనే 119 శాతం పెరిగాయని తెలుస్తోంది.




**2027 నాటికి 21.3 శాతం!**

ప్రస్తుతం ఇండియన్ కంపెనీలు తమ ఐటీ బడ్జెట్‌లో సగటున 16.6 శాతం ఏఐ కోసం ఖర్చు చేస్తున్నాయి. 2027 నాటికి ఇది 21.3 శాతానికి చేరుతుందని అంచనా. దీనివల్ల భారతదేశం ఏఐ రంగంలో ఎంత వేగంగా ముందుకు వెళ్తుందో అర్థమవుతుంది. ఏఐపై పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ.. దానిని సురక్షితంగా నిర్వహించడానికి అవసరమైన గవర్నెన్స్ మాత్రం ఆ స్థాయిలో లేదు. భారతదేశంలోని కేవలం 22 శాతం సంస్థలకే ఏఐ టెస్టింగ్, ఆడిటింగ్, రిస్క్ అసెస్మెంట్ వంటి విధానాలు ఉన్నాయి. 54 శాతం సంస్థలు ఏఐ ఏజెంట్‌ను ఉపయోగిస్తున్నప్పటికీ, కేవలం 11 శాతం మాత్రమే అటానమస్ వర్క్‌ఫ్లోను అమలు చేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఏఐ వల్ల వచ్చే సమస్యలపై సంస్థలకు ఉన్న ఆందోళనలు. కాబట్టి ఏఐను వేగంగా ఉపయోగించడం మాత్రమే కాకుండా, దాన్ని బాధ్యతాయుతంగా నియంత్రించడం కూడా చాలా అవసరం.

**ఏఐ విజయవంతంగా పనిచేయాలంటే..**

ఏఐ విజయవంతంగా పనిచేయాలంటే మంచి డేటా, సిస్టమ్స్ అవసరం. అయితే.. భారతీయ సంస్థల్లో ఇది ఇంకా ఒక పెద్ద సవాలుగానే ఉంది. 74 శాతం కంపెనీలు.. డేటా అక్యురసీ, యాక్సెస్, మేనేజ్మెంట్ వంటి వాటిన మెరుగుపరచాల్సిన అవసరం ఉందని చెబుతున్నాయి. కాగా మరో 56 శాతం సంస్థలు లెగసీ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ ప్రధాన సమస్యగా గుర్తించాయి. కేవలం 18 శాతం కంపెనీలు మాత్రమే విడివిడిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్స్‌కు భర్తీ చేశాయి. వివిధ విభాగాల డేటా ఒకదానితో ఒకటి కనెక్ట్ కాకపోతే ఏఐకు పూర్తి సమాచారం అందదు. అందువల్ల ఏఐ అభివృద్ధితో పాటు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కూడా బలోపేతం చేయాలి.

**ప్రభుత్వం చర్యలు**


ఏఐ విషయంలో భారత ప్రభుత్వం కూడా కొన్ని ముఖ్యమైన చర్యలు చేపడుతోంది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటక్షన్ యాక్ట్, డీపీడీపీ రూల్స్, ఏఐ గవర్నెన్స్ గైడ్‌లైన్స్, ఇండియాఏఐ మిషన్, ఇండియాఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్ వంటి కార్యక్రమాలు ఏఐ ఇన్నోవేషన్‌తో పాటు ప్రైవసీ, సేఫ్టీ, అకౌంటబిలిటీ వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇదే విధంగా సంస్థలు కూడా తమ ఇంటర్నల్ గవర్నెన్స్ సిస్టంను బలపరచాలి. ముఖ్యంగా ఏఐ ఏజెంట్లకు ఎంతవరకు డేటా, సిస్టమ్స్ యాక్సెస్ ఇవ్వాలి, ఎక్కడ హ్యూమన్ సూపర్ విజన్ అవసరం అనే విషయాలను స్పష్టంగా నిర్ణయించాలి. ఏఐపై ప్రజలకు, సంస్థలకు నమ్మకం ఏర్పడాలంటే ఈ గవర్నెన్స్ చాలా కీలకం. మొత్తం మీద.. భారతదేశం ఏఐలో పెట్టుబడులు పెట్టడంలో వేగంగా ముందుకు సాగుతోంది, కానీ గవర్నెన్స్ విషయంలో ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది.

# విక్టరీ వెంకటేష్ -త్రివిక్రమ్ ‘ ఆదర్శ కుటుంబం’ టీజర్ వచ్చేసింది!




విక్టరీ వెంకటేష్ స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న ఫ్యామిలీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం’ తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్ విషయానికి వస్తే.. ఇది పూర్తిగా మిడిల్ క్లాస్ ఫ్యామిలీ జోనర్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. వెంకటేష్ ఇందులో ‘చిట్టిబాబు’ అనే పాత్రలో కనిపించనున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, విక్రమ్ మార్క్ మాటలతో పాటు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్ కూడా టీజర్‌లో హైలైట్ అయ్యాయి. ఆదర్శ కుటుంబం అనే పేరుకు తగ్గట్టుగా ఇంట్లోని పరిస్థితులు, వాటి చుట్టూ జరిగే ఆసక్తికర పరిణామాలను ఈ టీజర్‌లో చూపించారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుండగా, నారా రోహిత్, సత్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాక్‌స్టార్ ఎస్. థమన్ (రా. ఒష్ఘుఌఖఅ) సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ సినిమాను అక్టోబర్ 2, 2026న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

# రచ్చ లేపడానికి రెడీ.. ఒక్క పోస్టుతో ‘స్వయంభూ’పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం ‘స్వయంభూ’పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నిఖిల్ తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేశారు. ““స్వయంభూ’ ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది” అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న ‘భూమి’ పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వపు మూలాలతో, ఒక యోధుడి గాథ ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ‘స్వయంభూ’ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ర్శకుడిగా మారిన రామ్.. హీరోయి-ౕన్‌గా పాప్యులర్ నటి!


ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘చ=ూ్రూూ23’. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు చిత్రబృందం తెరదించింది. ప్రముఖ నటి సంయుక్తను కథానాయికగా ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడటం విశేషం. సంయుక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రాజెక్ట్‌లోకి ఆమెను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ నూతన కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఒక వినూత్నమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. నియో-నోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతార్‌లో రామ్ ఈ సినిమాలో అలరించనున్నారని, నటుడిగానే కాకుండా దర్శకుడిగా కూడా ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు వెల్లడించాయి.



# ఇంటెన్స్ లవ్ స్టోరీ, పీరియడ్ ఫిలింస్ చేయాలని ఉంది: రకుల్ ప్రీత్ సింగ్

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం ‘రామాయణం’లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.






# హాలీవుడ్ రేంజ్‌లో భారతీయ పురాణం..

**ఏడు భాగాలుగా ‘శ్రీమద్భాగవతం’ మహాగాథ!**

ౠఖుస్త్రుఖుతీ్రాఅఏ్ఖబతీవం। భారతీయ బుల్లితెరపై ‘రామాయణ్’, ‘శ్రీ కృష్ణ’ వంటి అజరామరమైన పౌరాణిక సీరియళ్లతో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన దివంగత రామానంద్ సాగర్ వారసత్వం ఇప్పుడు భారీ స్థాయిలో వెండితెరపై పునరావృతం కాబోతోంది. ప్రతిష్టాత్మక సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ భారతీయ ప్రాచీన పురాణ గాథలను ఆధునిక సినిమాటిక్ శైలిలో అంతర్జాతీయ స్థాయిలో ఆవిష్కరించేందుకు శ్రీకారం చుట్టింది. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విశిష్టతలను సరికొత్త తరానికి ప్రతిబింబించేలా ‘శ్రీమద్భాగవతం’ మహాగాథను ఏకంగా ఏడు భాగాలుగా ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌గా మలచబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో ఈ సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణానికి శ్రీకారం చుడుతూ తొలి భాగంగా ‘శ్రీమద్భాగవతం: పార్ట్ వన్ -- విష్ణురథ’ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు వేగవంతం చేశారు. ఈ అత్యంత భారీ ప్రాజెక్ట్‌ను రామానంద్ సాగర్ మూడవ తరం వారసులైన ఆకాశ్ సాగర్ చోప్రా మరియు అమృత్ సాగర్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత అమృత్ సాగర్ గతంలో ‘1971’ వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన హిందీ చిత్రాన్ని రూపొందించి తన ప్రతిభను చాటుకున్నారు. ఇప్పుడు తన సోదరుడు ఆకాశ్ సాగర్‌తో కలిసి తమ కుటుంబ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆధునిక థియేట్రికల్ అనుభూతిగా మలిచే బాధ్యతను స్వీకరించారు. హైదరాబాదులోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామోజీ ఫిల్మ్ సిటీలో ఇటీవల అత్యంత వైభవంగా ఈ చిత్ర ముహూర్తపు వేడుకలు జరిగాయి. పౌరాణిక కాలాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేందుకు ఇక్కడే భారీ సెట్ల నిర్మాణం మరియు కీలకమైన లైవ్-యాక్షన్ చిత్రీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సాంకేతికపరంగా ఈ చిత్రాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ టెక్నీషియన్లను రంగంలోకి దించారు. వంటి ప్రపంచ ప్రఖ్యాత హాలీవుడ్ ప్రాజెక్టులకు వీఎఫ్‌ఎక్స్ అందించిన ప్రముఖ సాంకేతిక నిపుణుడు క్లైడ్ ఎడ్వర్డ్స్ ఈ చిత్ర విజువల్ ఎఫెక్ట్స్ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. అత్యున్నత సాంకేతికతను ఉపయోగిస్తున్నప్పటికీ కథలోని ఆత్మ, భారతీయ ఆధ్యాత్మిక భావనలు మరియు సంస్కృతి దెబ్బతినకుండా జాగ్రత్తలు వహిస్తున్నారు. కేవలం భక్తి చిత్రంగా మాత్రమే కాకుండా, అద్భుతమైన డ్రామా, అద్భుత దృశ్యకావ్యం మరియు విజువల్ వండర్‌గా రూపొందుతున్న ‘శ్రీమద్భాగవతం: విష్ణురథ’ ఫస్ట్ లుక్ ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలను నెలకొల్పింది.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com